# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 26-03-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- శ్రీరామ నవమి పండుగ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.
- పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులతో రేపు వర్చువల్‌గా సమావేశం కానున్నారు.
- రహదారి భద్రతను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం విస్తృత చర్యలు చేపట్టిందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు.
- దేశంలో పెట్రోల్, ఎల్పీజీ గ్యాస్ సరఫరా పూర్తి నియంత్రణలో కొనసాగుతోందని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.
- దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడానికి భారతదేశం కీలక ఖనిజాల అన్వేషణను వేగవంతం చేస్తోందని కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ అన్నారు.

======================

శ్రీరామ నవమి పండుగ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భగవంతుడైన శ్రీరాముని మహోన్నత జీవిత ప్రయాణం సత్యం, న్యాయం, సద్గుణాల మార్గాన్ని అనుసరించి సార్థకమైన జీవితాన్ని గడపడానికి మార్గనిర్దేశం చేస్తుందని రాష్ట్రపతి పేర్కొన్నారు. శ్రీరాముని గాథలోని గొప్ప బోధనలను స్ఫూర్తిగా తీసుకొని దేశానికి సేవ చేస్తామని ప్రతిజ్ఞ చేయాలని ద్రౌపది ముర్ము ప్రజలను కోరారు. సహనం, త్యాగం, న్యాయం పట్ల అంకితభావానికి ప్రతీకగా నిలిచే శ్రీరాముడు సకల మానవాళికి న్యాయం, సత్యం, అచంచలమైన సదాచారానికి ఆదర్శంగా నిలుస్తారని ఉపరాష్ట్రపతి సీ.పీ. రాధాకృష్ణన్ అభివర్ణించారు. త్యాగం, తపస్సు, సంయమనంతో కూడిన పురుషోత్తముడైన శ్రీరాముని జీవితం ప్రతి పరిస్థితిని పూర్తి శక్తితో ఎదుర్కోవడానికి ఒక స్ఫూర్తినిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. శ్రీరాముని ఆదర్శాలు, విలువలు రాబోయే కాలంలో దేశ ప్రజలకు మాత్రమే కాకుండా యావత్ మానవాళికి మార్గదర్శకంగా నిలుస్తాయని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ రేపు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులతో సమావేశం కానున్నారు. దృశ్య మాధ్యమ విధానంలో ఈ సమావేశం జరగనుంది. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న సంక్లిష్ట పరిస్థితులు దీర్ఘకాలం కొనసాగే అవకాశం ఉందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి ఇటీవల ప్రధాని మాట్లాడుతూ.. ఈ సంక్షోభం నుంచి బయటపడటంలో రాష్ట్రాలన్నీ కేంద్ర ప్రభుత్వంతో కలిసి ఒక సమిష్టి జట్టులా పని చేయాలని పిలుపునిచ్చారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోవడానికి ప్రజలు సిద్ధంగా ఉండాలని సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

రహదారి భద్రతను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం విస్తృత చర్యలు చేపట్టిందని కేంద్ర రోడ్డు, రవాణా, రహదారుల శాఖా మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన `సడక్ సురక్షా అభియాన్ 2026` కార్యక్రమంలో మంత్రి పాల్గొని నటుడు అమీర్ఖాన్ తో సంభాషించారు. దేశవ్యాప్తంగా ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్‌లను గుర్తించి, సరిదిద్దడం ద్వారా రహదారి భద్రతను మెరుగుపరచడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని నితిన్ గడ్కరి చెప్పారు. దీని కోసం 40 వేల కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేశామని తెలిపారు. వాహనాల్లో ఆరు ఎయిర్ బ్యాగ్‌లను తప్పనిసరి చేయడం, కీలకమైన రోడ్డు భద్రతా చట్టాలను ప్రవేశపెట్టడం, లైసెన్సింగ్ వ్యవస్థను డిజిటలైజ్ చేయడం, 200కు పైగా డ్రైవింగ్ శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేయడం వంటి చర్యలను ప్రభుత్వం చేపట్టిందని నితిన్ గడ్కరీ పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్ లోని మార్కాపురం జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బస్సు ప్రమాదంలో పలువురు సజీవదహనం కావడం అత్యంత విషాదకరమని ప్రధానమంత్రి  నరేంద్ర మోదీ అన్నారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. మృతి చెందిన వారి కుటుంబాలకు 2 లక్షలు రూపాయలు... గాయపడిన వారికి 50 వేల రూపాయల చొప్పున పరిహారం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల రూపాయల పరిహారం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతోన్నవారికి 2 లక్షల రూపాయల చొప్పున సహాయం అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. తెలంగాణలోని జగిత్యాల నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని కనిగిరికి వెళ్తున్న ఒక ప్రైవేట్ బస్సు ఈరోజు ఉదయం  మార్కాపురం జిల్లా రాయవరం వద్ద టిప్పర్‌ను ఢీ కొనడంతో బస్సులో మంటలు చెలరేగి 14 మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. మరో 27 మందికి గాయాలపాలయ్యారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో పెట్రోల్, ఎల్పీజీ గ్యాస్ సరఫరా పూర్తి స్థాయి నియంత్రణలో కొనసాగుతోందని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఇంధన కేంద్రాలలో తగినంత నిల్వలు ఉన్నాయని, ఎక్కడా కూడా పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ కొరత లేదని ఈరోజు విడుదల చేసిన పత్రికా ప్రటనలో తెలిపింది. సామాజిక మాధ్యమాల్లో పెట్రోల్, డీజిల్ కొరతపై వస్తున్న వదంతులను ప్రజలు నమ్మవద్దని విజ్ఞప్తి చేసింది. భారతదేశంలో పటిష్టమైన ఇంధన భద్రత ఉందని తెలిపింది. దేశీయ రిఫైనరీలు ఉత్పత్తిని 40 శాతం పెంచడంతో... రోజువారీ ఎల్పీజీ ఉత్పత్తి 50 వేల మెట్రిక్ టన్నులకు చేరిందని, ఇది దేశ అవసరాలను 60 శాతానికి పైగా  తీరుస్తుందని వెల్లడించింది.

నిల్వలు లేదా బ్లాక్ మార్కెటింగ్‌ను నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించి వాణిజ్య సిలిండర్ల కేటాయింపులను 50 శాతానికి పెంచారని తెలిపింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియాలో సంక్షోభం కొనసాగుతున్నప్పటికీ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత ఆర్థిక వ్యవస్థ మెరుగ్గానే రాణిస్తోందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖా మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. న్యూఢిల్లీలో ఒక ప్రైవేట్ ఛానల్ నిర్వహించిన సదస్సులో ఆయన ఈరోజు మాట్లాడుతూ... ఇంధన సంక్షోభాన్ని సమర్ధవంతంగా నిర్వహిస్తోందని పేర్కొన్నారు. భారతదేశ బలమైన దౌత్య సంబంధాలను, ప్రపంచ స్థాయిని ప్రతిబింబిస్తూ.. భారత నౌకలు హర్ముజ్ జలసంధి గుండా సురక్షితంగా ప్రయాణిస్తూనే ఉన్నాయని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్, గల్ఫ్ దేశాల ప్రభుత్వాధినేతలందరితో సహా ప్రపంచ నాయకులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారని రిజిజు వివరిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడానికి భారతదేశం కీలక ఖనిజాల అన్వేషణను వేగవంతం చేస్తోందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ పాలక మండలి సమావేశంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జితేంద్ర సింగ్ మాట్లాడుతూ.. అంకుర సంస్థల ఆధారిత మైనింగ్ ఎకో సిస్టమ్ ను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. కీలక ఖనిజాల రంగంలో అన్వేషణను వేగవంతం చేయడం, దేశీయ సామర్థ్యాన్ని బలోపేతం చేస్తోందని పేర్కొన్నారు. ముఖ్యంగా లిథియం, ఇతర ముఖ్య ఖనిజాల అన్వేషణ వేగం ప్రపంచ డిమాండ్, భారతదేశ వ్యూహాత్మక అవసరాలకు అనుగుణంగా ఉండాలని మంత్రి స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్ సహా చైనా, రష్యా, ఇతర మిత్రదేశాల వాణిజ్య నౌకలకు హోర్ముజ్ జలమార్గం ద్వారా ప్రయాణించేందుకు అనుమతినిస్తున్నట్లు ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాగ్చీ తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా సరఫరా అయ్యే చమురు, ఎల్ఎన్‌జీ లో సుమారు 20 శాతం ఈ మార్గం ద్వారా వెళ్తుంది. ఈ జలమార్గాన్ని తెరవకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ ను హెచ్చరించారు. అయితే తమ శత్రువులకు, వారి మిత్రదేశాలకు చెందిన నౌకలను ఈ మార్గం గుండా వెళ్లేందుకు అనుమతించేది లేదని ఇరాన్ విదేశాంగ మంత్రి స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఐపీఎల్ 2026 సీజన్‌కు సంబంధించి పూర్తిస్థాయి షెడ్యూల్‌ను బీసీసీఐ ఈరోజు విడుదల చేసింది. తొలి దశలో కేవలం 20 మ్యాచులకు మాత్రమే వేదికలు, తేదీలను ఖరారు చేసిన బీసీసీఐ రెండో దశలో 50 మ్యాచ్‌లకు షెడ్యూల్‌ను విడుదల చేసింది. దీంతో మొత్తం 70 లీగ్ మ్యాచ్ లకూ సంబంధించిన షెడ్యూల్ విడుదలయ్యింది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మేఘాలయ, హిమాలయ పరిసర పశ్చిమ బెంగాల్, సిక్కిం రాష్ట్రాల్లో రేపటి వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) హెచ్చరించింది. బీహార్, పశ్చిమ బెంగాల్, సిక్కిం ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలతో పాటు వడగళ్ల వాన పడే అవకాశం ఉందని ఆ శాఖ అంచనా వేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = =